నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, శుక్రవారం 18 అక్టోబర్ 2024 | PEDDAPALLI

# సర్కారు దవాఖానలో ఘోరం

- బాత్రూంలో ఆడ శిశువు పిండం
- మరోసారి చర్చనీయాంశంగా హుజూరాబాద్ ఏరియా వైద్యశాల

హుజూరాబాద్, అక్టోబర్ 17 : హుజూరాబాద్ ఏరియా దవాఖానలో గురువారం ఘోరం జరిగింది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఎమర్జెన్సీ వార్డులో ఉన్న బాత్రూంలో నెలలు నిండని ఆడశిశువు పిండం పడి ఉన్నది. ఓ పేషెంట్ బాత్రూంకు వెళ్లగా ఈ విషయం బయటపడింది. సిబ్బంది సూపరింటెండెంట్‌కు సమాచారం అందించారు. అయితే, అబార్షన్ చేసిన తర్వాత దవాఖానలోని కిందిస్థాయి సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా పిండాన్ని బాత్రూంలో వేశారా? లేకపోతే గర్భంతో ఉన్న మహిళ బాత్రూం వెళ్లగా అక్కడే ఆమెకు అబార్షన్ అయిందా..? లేదా ఇంకేమైనా జరిగిందా..? అనేది విచారణ చేస్తే బయటపడనున్నది. ఏదేమైనా పట్టణంలోని ఏరియా దవాఖాన వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నది. ఈ విషయమై డ్యూటీ డాక్టర్ రమేశ్‌ను సంప్రదించగా, అధికారులు, పోలీసులకు సమాచారం అందించామని, వారి సూచన మేరకు మార్చురీకి తరలించామని చెప్పారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

# కేసులపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఏది?

- బీఆర్ఎస్ నాయకులపై వేధింపులు ఆపాలి
- అక్రమ కేసులను వెంటనే విరమించుకోవాలి
- నగరాభివృద్ధికి పది నెలల్లో చేసిందేంటి?
- ఒక్క రూపాయైనా తెచ్చారా..?
- మాజీ మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, అక్టోబర్ 17: కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడంలో ఉన్న శ్రద్ధ నగరాన్ని అభివృద్ధి చేసే విషయంలో లేదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. తాము అధికారంలో ఉన్నప్పుడు వేల కోట్ల నిధులు తెచ్చి నగరాన్ని అభివృద్ధి చేశామని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని దుయ్యబట్టారు. గురువారం సాయంత్రం బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతిని కలిశారు. తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టవద్దని కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి నగరానికి రావాల్సినా సీఎం అస్యూరెన్స్ నిధులను మంజూరు చేయించడంతో పాటు మధ్యలోనే నిలిచిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం గంగుల కమలాకర్ మాట్లాడారు. తాము అధికారంలో ఉన్న పదేండ్లలో ఏనాడూ ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నం చేయలేదన్నారు. కానీ, కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై కక్షపూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలు అధికారం ఇచ్చింది అభివృద్ధి చేయాలని తప్ప, ఇలా తప్పుడు కేసులు పెట్టేందుకు కాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు కరీంనగరంలో అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. తమ హయాంలో సీఎం అస్యూరెన్స్ కింద ₹350 కోట్ల నిధులు తెచ్చామని, ఇంకా ₹130 కోట్ల నిధులు రావాల్సి ఉందని, వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఈ నిధులు రాకపోవడంతో నగరంలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి మధ్యలోనే ఆగిపోయిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం అస్యూరెన్స్ కింద కాంట్రాక్టర్ అనేక డివిజన్లలో రోడ్లను తవ్వి మధ్యలోనే వదిలేశారని, ఫలితంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వాల రమణారావు, డిండిగాల మహేశ్, బోనాల శ్రీకాంత్, ఐలేందర్, జంగిలిసాగర్, తోట రాములు, బీఆర్ఎస్ నాయకులు గందె మహేశ్, తుల బాలయ్య పాల్గొన్నారు.

# సర్వేకు సవాళ్లు?

- ఇంటింటి సర్వేకు సమయాత్తం అవుతున్న అధికార యంత్రాంగం
- 2011 జనాభా లెక్కల ఆధారంగా గణన బ్లాక్‌ల వివరాల సేకరణ
- ఉమ్మడి జిల్లాలో సర్వేకు 10 వేల మంది సిబ్బంది అవసరమని అంచనా
- 14 ఏళ్లలో 25 నుంచి 30 శాతం గృహాల పెరుగుదల
- 150 గృహాలకు ఒక బ్లాక్ చేసే విధంగా ప్రణాళిక
- ప్రస్తుత పరిస్థితుల్లో అనేక అడ్డంకులు
- వివరాల సేకరణ పెరిగితే సిబ్బంది సంఖ్య పెరిగే అవకాశం
- వివిధ రకాల పనుల్లో ప్రతి విభాగం అధికారులు

బీసీల లెక్కలు తేల్చాలన్న డిమాండ్ మేరకు ప్రభుత్వం ఇంటింటా సర్వేకు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. అయితే దీనిని బీసీలకు మాత్రమే పరిమితం చేయకుండా అన్ని వర్గాల వివరాలు సేకరించాలని నిర్ణయించి, అందుకు సమయాత్తం కావాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. జిల్లాలోని ముఖ్యప్రణాళిక కార్యాలయంతో అనుసంధానమై సర్వేను పూర్తి చేయాలని చెప్పడంతో సదరు శాఖ అంతా సిద్ధం చేస్తున్నది. 2011లో జరిగిన జనాభా గణాంకాలను పరిగణలోకి తీసుకొని చూస్తే.. ఉమ్మడి జిల్లాలో ఈ సర్వేను 60 రోజుల్లో పూర్తి చేసేందుకు 10 వేల మందికిపైగా సిబ్బంది అవసరం పడుతారని యంత్రాగం అంచనా వేసింది. ఆ మేరకు 2011 జనాభా లెక్కల గణన బ్లాక్ (ఎన్యూమరేషన్ బ్లాక్)ల వివరాలు తెప్పిస్తున్నది. వాటి ఆధారంగా ప్రతి 150 నుంచి 160 గృహాలకు ఒక బ్లాక్ చేసి సర్వే చేస్తే బాగుంటుందన్న అభిప్రాయంతో ముందుకెళ్తున్నది. కాగా, ఈ సర్వే చేసేందుకు అధికారయంత్రాంగానికి అనేక సవాళ్లు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి విభాగం అధికారులు. వివిధ రకాల పనుల్లో నిమగ్నమైన నేపథ్యంలో సర్వేకు కావాల్సిన 10వేల మంది సిబ్బందిని సమీకరించడం కత్తిమీద సాములాంటిదే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కరీంనగర్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పదేండ్లకోసారి జనాభా గణన జరగాలి. 1901 నుంచి మొదలు 2011 వరకు అలాగే జరిగింది. ఆ తర్వాత 2021లో జనాభా లెక్కింపు జరగాలి. అందుకు భారత ప్రభుత్వం అప్పట్లో అన్ని ఏర్పాట్లు చేసింది. అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. కేంద్రం ఆదేశాల మేరకు.. రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా లెక్కలకు సిద్ధమయ్యాయి. కానీ, కరోనా విపత్తు యావత్తు దేశాన్ని వెనక్కి నెట్టింది. అప్పుడున్న పరిస్థితుల్లో జనాభా లెక్కింపు వాయిదా పడింది. కాగా, ఈ గణన చేయాలని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు నేటికి డిమాండ్ చేస్తున్నా కేంద్రం నుంచి ఎటువంటి స్పష్టత లేదు.

## తప్పని పరిస్థితుల్లో సర్వేకు శ్రీకారం

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు చేయాలంటే కచ్చితంగా బీసీ కులగణన జరగాల్సిన అవసరమున్నది. అధికారంలోకి రావడానికి ఆ పార్టీ తన మేనిఫెస్టోలో అనేక హామీల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విడుదల చేసిన విషయం విదితమే. ఆ ప్రకారం కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీ రిజర్వేషన్ల పెంపు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. అక్కడితో ఆగకుండా కొత్త స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని చెప్పింది. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని స్పష్టం చేసింది. అంతే కాకుండా బీసీ వర్గాల్లో ఉపకులాల వారీగా వర్గీకరణ చేసి, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్నది. ఇది అమలు చేయాలంటే బీసీ కులగణన జరగాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో ఉన్న ఓటరు జాబితా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించి ఎన్నికలు నిర్వహించాలని సర్కారు ముందుగా ఆలోచన చేసినా.. బీసీ సంఘాలు మాత్రం కొత్తగా కులగణన సర్వే జరిగి తీరాల్సిందేనంటూ పట్టుబట్టాయి. పలు చోట్ల ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. సర్వే ఆధారంగా తమకు రిజర్వేషన్లు పెంచాల్సిందేనంటూ స్పష్టం చేశాయి. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. తప్పించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ క్రమంలోనే ఇంటింటా సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే పనిలో పనిగా సర్వేను బీసీలకు మాత్రమే పరిమితం చేయకుండా.. అన్ని వివరాలు సేకరించాలని నిర్ణయించింది. ఆ మేరకు వచ్చిన ఆదేశాలను పరిగణలోకి తీసుకొని అధికార యంత్రాంగం సమాయత్తం అవుతున్నది.

## సమాయత్తం

రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేసేందుకు 80వేల మంది ఎన్యూమరేటర్లు, 10వేల మంది సూపర్‌వైజర్లు అవసరమని రాష్ట్ర బీసీ కమిషన్ ఇప్పటికే తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో సర్వేను నిర్దిష్ట గడువులోగా పూర్తిచేసి, వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలంటే 10వేల మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు అవసరమని అంచనా వేసింది. అంతేకాదు, సర్వే ఫార్మాట్‌కు సంబంధించి అందుతున్న సమాచారం ప్రకారం చూస్తే.. ప్రతి కుటుంబానికి సంబంధించి 54నుంచి 60 అంశాలపై వివరాలు సేకరించాల్సి ఉంటుందని తెలుస్తుండగా.. సర్కారు నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నది. సేకరించాల్సిన వివరాలు పెరిగితే.. సిబ్బంది సంఖ్యను కూడా పెంచాల్సిన అవసరం ఉంటుంది. సర్వే కచ్చితంగా చేయాల్సి ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా యంత్రాగం ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నది. అందులో భాగంగానే 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకొని ఎన్యూమరేటర్లు, బ్లాక్‌ల వివరాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం చూస్తే.. ఆనాటి ఉమ్మడి జిల్లాలో 37,76,289 మంది జనాభా ఉన్నది. మొత్తం 9,76,022 గృహాలుండగా, ఆనాడు ఉన్న 57 మండలాలు కలిపి ఉమ్మడి జిల్లా 11,824 చదరపు కిలోమీటర్లకు విస్తరించి ఉన్నది. అప్పుడు 6,506 బ్లాక్‌లుగా విభజించి ఈ సర్వే చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన 14 ఏళ్లలో పల్లెలు, పట్టణాలు, నగరాల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. లక్షాలాది గృహాలు కొత్తగా వెలిశాయి. జనాభా కూడా అదే స్థాయిలో పెరిగింది. తాజా అంచనాల ప్రకారం చూస్తే గడిచిన 14 ఏళ్లలో 25 నుంచి 30 శాతం మేరకు గృహాలు పెరిగి ఉంటాయని భావిస్తున్నారు. 2011తో పోలిస్తే జనాభా మరో 7 నుంచి 8 లక్షల వరకు పెరిగి ఉండొచ్చని చెబుతున్నారు. ఎందుకంటే 2001తో పోలిస్తే 2011 నాటికి 2,84,447 మంది పెరిగారు. ప్రస్తుతం 14 ఏళ్ల తర్వాత లెక్కలు జరుగుతున్న నేపథ్యంలో గృహాలు, జనాభా అంచనాకు మించే ఉండొచ్చని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## అనేక అడ్డంకులు?

ప్రస్తుతం ఈ సర్వే చేసేందుకు అధికారయంత్రాంగానికి అనేక సవాళ్లు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాజా అంచనాల ప్రకారం సర్వేకు పదివేల మంది సిబ్బంది అవసరం పడుతుండగా.. ముందుందు ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో అన్ని విభాగాల సిబ్బందిని భాగస్వాములను చేస్తేనే సర్వేను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసే అస్కారముంటుంది. ప్రధానంగా ఉపాధ్యాయులను వినియోగించకుండా గడువులోగా పూర్తి చేయడం సాధ్యం కాదన్న అభిప్రాయాలను అధికారులే వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వ బడుల్లో ఇప్పటికే అంతంత మాత్రంగా ఉపాధ్యాయులున్నారు. బోధన అలాగే కొనసాగుతున్నది. వచ్చే డిసెంబర్ నుంచి ప్రతి స్కూల్‌కూ ఒక పరీక్ష కాలమే. సిలబస్ పూర్తి చేయడం, రివిజన్ చేయించడం వంటివి వారికి చాలెంజ్‌గా ఉంటాయి. ఈ సమయంలో ఉపాధ్యాయులను వినియోగిస్తే.. పాఠశాల విద్యపై ప్రభావం పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు బడుల పరిస్థితులను పరిగణలోకి తీసుకొని, ప్రస్తుత పరిస్థితుల్లో సర్వే నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా, పరోక్షంగా కోరుతున్నారు. రెవెన్యూ పరంగా చూస్తే.. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇవి పూర్తి కావడానికి కనీసం రెండు నెలలు పడుతుంది. రెవెన్యూ యంత్రాంగం ఇక్కడ లేకపోతే.. కొనుగోళ్లపై భారీ ప్రభావం పడడంతోపాటు రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదమున్నది. ఈ పరిస్థితుల్లో రెవెన్యూ విభాగం నుంచి పెద్దగా సిబ్బందిని తీసుకోవడానికి అస్కారం కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ అధికారులు డిజిటల్ క్రాప్ సర్వేతో సతమతమవుతున్నారు. ఇప్పటికే 49 రకాల విధులు నిర్వర్తిస్తున్నామని, డిజిటల్ సర్వే నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. పంచాయతీ విభాగం అధికారుల పరిస్థితి అలాగే ఉన్నది. సర్వే పూర్తి కాగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. అందుకోసం సదరు శాఖ సన్నద్ధం కావాల్సిన అవసరమున్నది. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి నుంచి మొదలు ఎంపీడీవోల వరకు బీజీగానే ఉన్నారు. ఒక వేళ ప్రభుత్వోద్యోగులను కాకుండా ప్రైవేట్ సిబ్బందిని నియమిస్తే.. వివరాల సేకరణలో ఏమైనా తప్పులు జరిగితే వారిపై చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోతుంది. ఈ పరిస్థితుల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై యంత్రాంగం తర్జనభర్జన పడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే స్పష్టత కోసం చూస్తున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం సర్వే నిర్దిష్ట సమయంలో పూర్తవుతుందా.. లేదా? అన్నది తేలుతుంది.

నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న యాజమాన్యం, సిబ్బంది

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వండి

కరీంనగర్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది డిమాండ్

కమాన్ చౌరస్తా, అక్టోబర్ 17 : ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు మూడేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కరీంనగర్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యజమానులు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి నగరంలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో డిగ్రీ, పీజీ కాలేజీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని, జీతాల చెల్లింపు, భవనాల అద్దెలు, నిర్వహణ కూడా కష్టంగా మారిందని వాపోయారు. అధికారులు, మంత్రులను కలిసి విన్నవించినా కనీస స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించాలని, తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి ఎస్ నరేశ్, డిగ్రీ కళాశాలల కరీంనగర్ జిల్లా కో-ఆర్డినేటర్ గోవిందవరం కృష్ణ, రవీందర్ రెడ్డి, వేణు, సతీశ్ కుమార్, ప్రిన్సిపాల్స్ వర్మ, ఎల్ శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, చైతన్య, మనోహర్, చంద్రశేఖర్ రెడ్డి, నరేశ్, సీహెచ్ శ్రీనివాస్, జీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వం.. శ్రీనివాసుడి రథోత్సవం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 17: శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సిరిసిల్లలో నిర్వహించిన రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆద్యంతం భక్తుల గోవింద నామస్మరణతో కార్మికక్షేత్రం పులకరించిపోయింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మాడ వీధుల గుండా జరిగిన రథోత్సవంలో శ్రీనివాసుడు రథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. భక్తుల కోలాటాలు.. గోవింద నామస్మరణలతో పురవీధులు మారుమోగాయి. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ప్రారంభమైన రథోత్సవం సుమారు గంట వరకు సాగింది. అనంతరం రాత్రి 10 గంటలకు అశ్వవాహనంపై దోపు కథ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రథోత్సవంలో పాల్గొన్నారు. రథంపై కొలువుదీరిన దేవదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీనివాసుడి రథోత్సవంలో అశేషంగా పాల్గొన్న భక్తజనం



మాట్లాడుతున్న శాతవాహన జేఏసీ వ్యవస్థాపకుడు చెన్నమల్ల చైతన్య, నాయకులు

# రవీందర్‌సింగ్ గెలుపు కోసం పాదయాత్ర

శాతవాహన స్టూడెంట్ జేఏసీ వ్యవస్థాపకుడు చైతన్య

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 17 : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ మేయర్ రవీందర్‌సింగ్ గెలుపు కోసం కరీంనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వరకు శాతవాహన స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులు పాదయాత్ర చేస్తారని వ్యవస్థాపకుడు చెన్నమల్ల చైతన్య తెలిపారు. నగరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన రవీందర్‌సింగ్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. రవీందర్‌సింగ్ గెలుపుకోసం నాలుగు జిల్లాల్లో పర్యటించి పట్టభద్రులను కలుసుకుంటామన్నారు. ఈ నెల 19న ఉదయం 8 గంటలకు వేంకటేశ్వరాలయం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తామన్నారు. ఈ యాత్రలో రవీందర్‌సింగ్ గతంలో చేసిన కార్యక్రమాలు, చేపట్టబోయే కార్యక్రమాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీల జేఏసీ నాయకులు అరుణ్‌కుమార్, సత్యనారాయణ, రాము, మహేశ్, అశోక్ పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరా ఆదాయం

# ₹31.50 కోట్లు

- ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు భారీగా రాబడి
- 16 రోజుల్లో 61.12 లక్షల మంది ప్రయాణం

తెలంగాణచౌక్, అక్టోబర్ 17 : బతుకమ్మ, దసరా పండుగలకు ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ ₹31.50 కోట్ల ఆదాయం వచ్చింది. పండుగల సందర్భంగా అధికారులు ఈ నెల ఒకటి నుంచి 12వ తేదీ వరకు, 14 నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేకంగా బస్సులను నడిపించారు. 16 రోజుల్లో 11 డిపోల పరిధిలో 980 బస్సులు తిరుగగా, 61 లక్షల 11వేల 849 మంది ప్రయాణించారు. అందులో 42 లక్షల 34 వేల 544 మంది మహాలక్ష్మీ డిపోల వారీగా ఆదాయం చూస్తే గోదావరిఖనికి ₹5.27 కోట్లు, హుస్నాబాద్‌కు ₹1.43 కోట్లు, హుజూరాబాద్‌కు ₹2.11 కోట్లు, జగిత్యాలకు ₹4.22 కోట్లు, కరీంనగర్-1కు ₹3.38 కోట్లు, కరీంనగర్-2కు ₹4.23 కోట్లు, కోరుట్ల ₹2.26 కోట్లు, మంథని ₹1.84 కోట్లు, మెట్‌పల్లి ₹2.14 కోట్లు, సిరిసిల్ల ₹2.27 కోట్లు, వేములవాడ ₹2.33 కోట్ల ఆదాయం వచ్చినట్టు ఆర్ఎం సుచరిత తెలిపారు. రోజుకు 4 లక్షల మంది ప్రయాణికులు వివిధ గమ్య స్థానాలకు ప్రయాణం కొనసాగించారని, రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించామని చెప్పారు. సహకరించిన సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లకు అభినందనలు తెలిపారు.

ముస్తాబాద్ మండలంలోని కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

# ధాన్యం.. నీళ్లపాలు

- ముస్తాబాద్ మండలంలో భారీ వర్షం
- కొట్టుకపోయిన వడ్లు
- ఆదుకోవాలని రైతన్న వేడుకోలు

ముస్తాబాద్, అక్టోబర్ 17 : అకాల వర్షం రైతులను ఆగం చేసింది. రెక్కలు ముక్కలు చేసుకొని పండించి, కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్లను నీటిపాలు చేసింది. ముస్తాబాద్ మండలం చీకోడు, పోతుగల్ గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు పడిన భారీ వానకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యమంతా తడిసి ముద్దయింది. ముఖ్యంగా ఈ రెండు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, అంతలోనే వర్షం పడడంతో భారీ నష్టం వాటిల్లింది. అర్ధరాత్రి కూడా ధాన్యపు రాశులు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, అక్టోబర్ 17 : కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్తవి చేయడం చేతకాదని, కనీసం ఉన్నవి చెడగొట్ట కండా ఉండాలని, అద్దె భవనాల్లో ఉన్న గురుకులాలకు ముందు అద్దె చెల్లించాలని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో హితవు పలికారు. కేసీఆర్ ప్రభుత్వం ఎంతో బలోపేతంగా నిర్మించి ఇచ్చిన గురుకుల వ్యవస్థను కనీసం నిర్వహించడం కూడా రేవంత్ సర్కార్‌కు చేతకావడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ తన పాలనలో దేశంలో ఎక్కడాలేని విధంగా వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, కళాశాలలు స్థాపించి సన్నబియ్యంతో అన్నం పెట్టి, ఒక్కో విద్యార్థిపై ఏడాదికి ₹1.20 లక్షలకు పైగా ఖర్చు చేసి సబ్బండ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి విద్యా వ్యవస్థను అగ్ర శిఖరాన నిలిపారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం తెచ్చిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా ఆపేసిన అసమర్థ కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ పాలన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు.